# చక్షుభ్రాంతి

## చిటారెడ్డి సూర్యకుమారి



ఎండలో నడిచి వచ్చిన సుబ్బారావుకి ఇంట్లోకి రాగానే ప్రాణం హాయనిపించింది. చెప్పులు వదలి, ఫాన్ క్రిందనే ఉన్న ఈజీచెయిర్‌లో కూర్చుంటూ ఆ గదిలోనే పుస్తకం చదువుకుంటున్న అమ్మాయితో—"హేమా! చల్లటి మంచి నీళ్ళు తీసుకురా, తల్లీ! అబ్బబ్బా ఏం ఎండలు—ధరల్లా మండిపోతున్నాయి" అన్నాడు.

ఆ అమ్మాయి ఒక గ్లాసులో చల్లటి నీళ్ళు మరో గ్లాసులో మజ్జిగా తీసుకు వచ్చిన ట్రే ఆయన ముందుంచింది.

ముందు మజ్జిగ గడగడ త్రాగేసి ఆ గ్లాసు ట్రేలో ఉంచి మంచినీళ్ళ గ్లాసు అందుకుని, "హేమా! చదివేప్పుడు లేదు. మీ అమ్మ వంటింట్లో లేదా? ఎక్కడున్నా ఒకసారి ఇటు రమ్మను." నీళ్ళు త్రాగి అదీ ట్రేలో ఉంచాడు.

"బాబాయ్!" అంటూ పెద్దగా నవ్వింది ఆ అమ్మాయి.

"హేమ, ! పిన్ని మహాలక్ష్మి ఇంటికి వెళ్ళారు." అప్పుడు గుర్తించాడు మల్లేశ్వరిని. ఇంతసేపు తన కూతురు హేమ అనే తలచాడు. చూస్తూ హేమనే అనుకున్నాడు. ఈవేళప్పుడు ఎక్కడో వూర్లో ఉన్న మల్లేశ్వరి తన ఇంట్లో ఉంటుందని ఎలా అనుకుంటాడు! మనస్సులో ఏముంటే కళ్ళు అలాగే చూస్తాయని, గుర్తిస్తాయని గ్రహించాడు. చక్కని చుక్కలా ఉన్న మల్లేశ్వరిని చూసి నిట్టూర్చాడు.

"ఎప్పుడొచ్చావ్? వస్తున్నట్లు ఉత్తరం వ్రాయలేదు. అమ్మా, నాన్న కులాసేనా!"

'ఏం కులాసా' అన్నట్లుగా సుబ్బారావు నిట్టూర్చి—"నిన్ను ఒక్కదాన్నే ఇంట్లో ఉంచి వాళ్ళు షికారు వెళ్ళారా?"

"పిలిచారు రమ్మని. నేనే పోలేదు."

"ప్రయాణంలో అలసిపోయి ఉంటావ్! రెస్టు తీసుకోమ్మా!" కుర్చీలో వాలి పడుకున్నాడు.

అందానికి అందం చదువు సంస్కారం ఉండి, కట్నం ఇవ్వగలిగిన స్థితిలో ఉన్నా కామేశ్వర్ ఇక ఈ జన్మలో మల్లేశ్వరికి పెళ్ళి చేయలేనని బాధపడుతూ ఉత్తరం రాశాడు.

బంధుత్వానికి తా మిద్దరు అన్న దమ్ములే అయినా ఇద్దరి మధ్య స్నేహం ఎక్కువ.

కామేశ్వర్ ఏరికోరి అందమైన అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు. కట్నం, కానుకలు తీసుకో లేదు. కామేశానికి వరుసగ అమ్మాయిలే పుట్టారు.

"ఏంట్రోయ్! వరుసబెటి అమ్మాయిల్ని కనేస్తున్నావ్" అని స్నేహితులు తమాషా చేస్తే—'ప్రకృతిని ఆరాదించే నాకు అమ్మాయిలు గాక అబ్బాయిలు పుడుతారా? నాకు అమ్మాయిలని బెంగలేదు. వాళ్ళకి పెళ్ళిళ్ళు కావని దిగులు లేదు. నా కూతుళ్ళ కొరకు పోటీపడి రాజకుమారులే వస్తారు!" అంటూ హాయిగ నవ్వేవాడు.

పెద్దమ్మాయి భానుమతికి పైసా కట్నం ఇవ్వకుండ గ్రాండ్‌గా పెళ్ళి చేశాడు.

రెండోపిల్ల రత్నమాల. మూడోది మల్లేశ్వరి. మల్లేశ్వరి సినిమా చూసి కూతురికి మల్లేశ్వరని పేరు పెట్టాడు. ఆడపిల్లల్ని మగపిల్లల్లా పెంచాడు. అదే ముప్పయింది. ఆలోచనల్లో మునిగిపోయాడు సుబ్బారావు.

ఎలాగైనా సరే, హేమతోపాటు మల్లేశ్వరికి పెళ్ళి చేయాలి. వాడికి ఆమాత్రం సహాయం చేయక తప్పదు. ఆ విషయాలు ఎవ్వరికి తెలియ నివ్వకూడదు. మల్లేశ్వరి ఫలానవారి అమ్మాయి అని చెప్పకూడదు.

ఇందాక మల్లేశ్వరిని హేమ అనే తలచాడు.

మనం ఏ దృష్టితో చూస్తామో అలాగే కనుపిస్తారు. ఇంతకంటె ఏ నిదర్శనం కావాలి.

సుబ్బారావ్ ఆలోచనల్లో నుంచి పగటి నిద్రలోకి జారిపోయాడు.

* * * *

ఎండ చిట్ పట్ మంటూ పేలిపోతుంది. ఆ ఎండకు తాళలేక పెద్దవాళ్ళు ఆపసోపాలు పడుతూ ఇండ్లల్లో దాక్కున్నారు.

ఆ మధ్యాహ్నవేళ నవ్వుతూ తుళ్ళుతూ నలుగురు అమ్మాయిలు ఇంట్లోకి వచ్చారు. ఆ ఎండ వారినేమి బాధించనట్లు తామర పువ్వుల్లా కళకళ లాడుతున్నారు. వారి మాటలు, నవ్వులు విని హేమ బయటికి వచ్చింది. కొలనునుండి బయటపడిన కలువలా ఉన్న హేమను చూసి "ఏయ్! ఇంకా అప్పలమ్మలా ఉన్నావా? పిక్చర్ రెండున్నరకే బిగిన్ చేస్తారు. వూ.....త్వరగా కానీయ్ నీ ముస్తాబు" అని ఒకమ్మాయి అంది.

మరో అమ్మాయి టైం చూసుకుంటూ, "టైం లేదు. అలాగే వచ్చేయి!" అంటూ తొందర చేసింది.

హేమ అమ్మ చల్లటి నీళ్ళు వారికిస్తూ—"ఈరోజు దాన్ని వదిలేయండి. అసలే తల నొప్పి అంటోంది. ఈ ఎండలో వచ్చిందా, జ్వరం వస్తుంది" అని ఆ గడుసు అమ్మాయిలతో అంది.

"శోభ ఈపాటికి టిక్కెట్లు తీసి ఉంటుంది. పైగా ఈరోజు లాస్ట్ డే!" రెంప్ట్ చేస్తూ హేమవైపు చూసింది.

శకుంతలమ్మ మల్లేశ్వరిని పిలిచింది. కోటా చీరలో అందంగ నడిచి వచ్చిన మల్లిని చూస్తూ అల్లరి మరచిపోయారు.

"నా కజిన్" అని హేమ వారికి పరిచయం చేసింది. ఆడవాళ్ళనే చకితులను చేసిన మల్లేశ్వరికి పెళ్ళికావటం గగనమైపోతుందని హేమ తల్లి నిట్టూర్చింది. "హేమ బదులు మల్లి వస్తుంది. మీ టిక్కెట్లు వృధా కాదు. మరి బయలు దేరండి!" అంటూ శకుంతలమ్మ వారిని తొందర

చేసింది.

శోభ టిక్కెట్లు తీసుకుని ఎవరెస్ట్ ఎక్కినంత సంతోషిస్తూ ఫ్రెండ్స్ కొరకు ఎదురు చూస్తూండే రేగిన జుట్టుతో ఎండకి కళ్ళు చిట్లించి చూస్తుంటే వాళ్ళకి నవ్వాగింది కాదు.

“సిగ్గులేకుండ ఎందుకు నవ్వుతున్నారు! సినిమా మొదలు పెట్టారు. మరో నిముషం చూసి లోపలికి వెళ్ళి కూర్చుందును. అప్పుడు తిక్క కుదిరేది” ఫట్ ఫట్‌మని తిట్టేసింది. మల్లేశ్వరిని చూసి “ఎవ్వరీ స్వప్నసుందరి!” కోపంగానే అడిగింది.

అందులో ఒకమ్మాయి “నీవేమి అనుకోకు, మల్లి. ఇది మా బాయ్ ఫ్రెండ్!” అంటూ కన్నుకొట్టింది.

మరో పిల్ల “సినిమా మొదలెట్టారా! వోరి నాయనా! వోలమ్మో!” అంటూ మెట్లపైన పరుగెత్తింది.

మిడిసిపడే ఎండనుంచి వచ్చారేమో హాలులోకి అడుగు పెట్టిన వారికి కళ్ళకేమి కనుపించలేదు. పరిచయమున్న థియేటరేమో తడుముకుంటూ వెళ్ళి కూర్చుంటున్నారు, మల్లేశ్వరి తలుపు దగ్గరే ఉన్న సీటు పట్టుకుని అందులో కూర్చుంది.

ముందు వరుసలో కూర్చున్న శోభ—“అందరూ కూర్చున్నారా? స్వప్నసుందరీ! ఎక్కడా?” అంది.

తను కూర్చున్న కుర్చీ గట్టిగా ఎగుడు దిగుడుగా ఇలా ఉందేమిటి? అని అనుకుంటూ—

“ఇక్కడ” అని జవాబు ఇచ్చింది.

సిటీలో కూడా కుర్చీలు పాడుచేస్తారా? వాళ్ళ వూరిలో కరెంటుపోయినా, ఫిల్మ్ కట్ అయినా ఆలస్యానికి కోపం వచ్చి ప్రేక్షకులు సీట్లను కోస్తారు. ఈ కుర్చీ మరీ అన్యాయంగా ఉంది’ అని తలచింది.

కళ్ళు చీకటి అలవాటుపడి చీకట్లోకి చూడ సాగినాయి. ప్రక్కనే సీటు ఖాళీగా ఉంది. బాగుండనిపించింది. లేచి ఆ కుర్చీలో కూర్చుని ఇటు చూసింది. అతను నవ్వుతూ ‘థాంక్స్’ అన్నాడు.

మల్లేశ్వరి కళ్ళు విప్పారినై. అప్రయత్నంగా చెయ్యిచాచి కుర్చీని తడిమింది ‘తన కళ్ళు భ్రమిస్తున్నాయా’ అనుకుంటూ. ఇంతసేపు తను ఆ కుర్చీలో కూర్చుంది. మరి! మరి... అతను ఉన్నాడు!!

మల్లేశ్వరి చాచిన చేతిని అతను అందుకుని మెత్తగా, స్నేహంగా వత్తుతూ—“నేను కుర్చీని కాదు. మనిషినే..ఇంతసేపు నీవు నామీద కూర్చున్నావ్. డోంట్ వర్రీ సినిమా చూడు” అన్నాడు.

మల్లేశ్వరికి మూర్ఛ వచ్చినటయింది. వూపిరి వెనక్కి లాక్కుంది. కుర్చీకి అతుక్కుపోయి కళ్ళు మూసుకుంది. సిగ్గుతో ప్రాణం చచ్చిపోతుంది.

“స్వప్నసుందరీ! నీవు బాగున్నావా? ఇంగ్లీష్‌లో అడిగాడు.

“ఆక్సిడెంట్స్ జరుగుతుంటాయి. వాటికి ఎవ్వరూ బాధ్యులు కారు” అతనులో గొంతుకతో మాట్లాడుతున్నాడు. అతని స్వరం బాగుంది.

నాగరికంగా, మృదువుగా మంచిగా మాట్లాడు తున్నా ధైర్యంచేసి కళ్ళు విప్పి అటు చూడలేక పోయింది.

భయపడుతూండగానే ఇంటర్‌వెల్ అయింది. కళ్ళు తెరవక తప్పలేదు. తప్పనిసరిగా అటూ చూడ వలసి వచ్చింది. అతను లేడు. తేలిగ్గా నిట్టూర్చింది.


తిరిగి సినిమా ప్రారంభమైంది. అతను తిరిగి రాలేదు. సీటు ఖాళీగానే ఉంది. అతను ఎవ్వరో కాని చాలా మర్యాదస్తుడు. హృదయాంజలులు అర్పించుకుంది.

* * * *

“అమ్మాయ్ హేమా!” అంటూ ఎప్పటిలా సుబ్బారావు పిలుస్తూ లోపలికి వచ్చాడు.

మల్లేశ్వరి నవ్వుతూ వచ్చింది వరండాలోకి. “పిన్ని, హేమ షాపింగ్‌కు వెళ్ళారు.”

“నీవు ఒక్కదానివే ఉన్నావా!” నొచ్చు కున్నట్లుగా అని, ఇంకా బయటనే నిల్చున్న అతన్ని “రా, అశోక్! ఈ అమ్మాయి నా ఫ్రెండ్



కూతురు—మల్లేశ్వరి. ఈ అబ్బాయి నా ఫ్రెండ్ కొడుకు—డాక్టర్. ‘ఇరాన్ లో ఉంటున్నాడు” అని పరిచయం చేశాడు.

కళ్ళప్పగించి చూస్తున్న అతనికి నమస్కారం చేసింది. లోపలికి వెళ్ళలేక, అక్కడ ఉండలేక తటపటాయిస్తూ నిల్చుంది మల్లేశ్వరి.

‘మన డాక్టరుకు మజ్జిగో! కూల్ డ్రింకో! ఏది ఉంటే అది పట్రా తల్లీ!” అని చెప్పారు.

ఒక్క అడుగులో లోపలికి వచ్చింది.

‘పెద్దవాళ్ళు ఉన్నారని కూడ తలచక అలా చూస్తాడేమిటి? ఎలాగో ఉంది. బయటికి పోను జంకుగా ఉంది. బాబాయ్ ఏమనుకుంటారు! అందుకే తను ఎక్కడికీ పోదు! ఫలానా అని తెలిస్తే వింతగా చూస్తారు. గుసగుసలాడుతారు’ శరబత్ కలుపుతూ అనుకుంది మల్లేశ్వరి.

లోపలికే చూస్తున్న అశోక్‌తో సుబ్బారావు



అన్నారు. “మల్లి చాలా అందంగ ఉంది కదూ” మళ్ళీ మళ్ళీ చూడాలనిపించే అందం బహు కొద్దిమందికే ఉంటుంది సుమా!

నా ఫ్రెండ్ అమెరికాలో ఉన్నాడు. పదేళ్ళో సంవత్సరానికిగాని రారు. ఒక్కటే కూతురు. బి. ఏ. చదివింది. పెళ్ళి బాధ్యత నాకు అప్పగించాడు.”

ట్రే పట్టుకు వస్తున్న మల్లేశ్వరి బాబాయ్ మాటలు విని ఉలిక్కిపడింది.

బాబాయ్‌కి ఎండ దెబ్బ తగలలేదు కదా! అలా మాట్లాడుతున్నా డేమిటి? నేను అమ్మానాన్నకు ఒక్కదానినేనా! నూట యాభై మైళ్ళ దూరంలో ఉన్న వాళ్ళని అమెరికా పంపేశాడు. బాబాయ్ ఎందుకు అన్ని అబద్ధాలు ఆడుతున్నారు! నొసలు చిట్లించింది మల్లేశ్వరి.

మల్లేశ్వరిని చూసి అశోక్ గబుక్కున లేచి నిలుచుని, చిరునవ్వుతో నేరుగా మల్లేశ్వరిముఖంలోకి చూస్తూ గ్లాసు అందుకుంటూ స్వప్నసుందరీ!” అని మెల్లిగా పిలిచాడు.

ఉలిక్కిపడ్డట్లు చూసింది. అతని కళ్ళు కొంటెగా మెరుస్తున్నాయి.

కలువలా ఉన్న మల్లేశ్వరి చంగల్వే అయింది.

* * * *

ఒక పెళ్ళికి వెయ్యి అబద్ధాలైనా ఆడవచ్చన్నారు. నేను మూడే మూడు ఆడాను. మనం చెప్పిన వాటి కన్నిటికి అశోక్ ఒప్పుకున్నాడు. అతనికి [illegible] అన్యాయం చేయలేదు. నీలాంటి అందాల రాశి భార్యగా దొరికినందుకు అతను సంతోషపడుతున్నాడు పెళ్ళి కుదిర్చినందుకు నాకు కృతజ్ఞతలు చెప్పాడు” అని సుబ్బారావు నవ్వారు.

తలవంచుకుని కూర్చున్న మల్లేశ్వరి తల నిమురుతూ “అలా దిగులుగా కనపడకు. అతను వచ్చేవేళ అయింది” శకుంతలమ్మ హుషారు చేసింది.

చెప్పిన టైంకు అశోక్ టంచన్‌గా వచ్చాడు అందరు కలిసి షాపింగ్ చేద్దాం అనుకున్నాము కాని ఇంట్లో బోలెడు పనులున్నాయి, మేం రాము

వాణిజ్య ప్రకటనలకు
ఆంధ్రప్రభ
ఉత్తమ సాధనం







మీ రిద్దరే వెళ్ళిరండి" అని శకుంతలమ్మ పంపో వచ్చింది.

మల్లేశ్వరి తల వంచుకుని అశోక్ వెనక నడిచింది

మల్లేశ్వరి తలెత్తుకుని, అశోక్ ప్రక్కన నడిచే దాక 'హాయ్' వూరుకోలేదు

హాయ్ చేసే అల్లరికి అశోక్ నవ్వాడు

"స్వప్నసుందరీ! నీకు రింగ్ కొనాలి నీకు ఏ స్టోన్ ఇష్టం!"

"నా పేరు మల్లేశ్వరి!"

"నాకు స్వప్నసుందరివి" అటుపోతున్న ఆటోని కేకేశాడు.

ఆటోలో కూర్చుంటూ "మీతో మాట్లాడాలి" కళ్ళు క్రిందికి వాల్చి చెప్పింది.

దీర్ఘంగా మల్లేశ్వరి వైపు చూసి "నీ వంటే ఇష్టం లేదు. 'పెళ్ళిచేసుకోను' అని అనవుకదా నేను ఎంతో ఆనందంగా ఉన్నాను. ఆ మాట తప్పించి ఏమి చెప్పినా వింటాను" అన్నాడు.

అలాగే అన్నట్లు తల వూపింది.

తేలిగ్గా వూపిరి పీల్చి ఆటో పబ్లిక్ గార్డెన్ వైపు పోనిమ్మన్నాడు.

* * *

చెట్టు క్రింద అనువైన స్థలం చూసి కూర్చున్నారు.

"నీవు చెప్పదలచుకున్నది చప్పున చెప్పేయి. ఒక ఫ్రెండ్‌ను కలుసుకోవాలి. నీకు వీసా పాస్‌పోర్టు సంపాదించాలి."

తను చెప్పింది విన్నాక తనను పెళ్ళి చేసుకుంటాడా ఈ మర్యాదస్తుడ్ని చూస్తుంటే హృదయం వేగంగా కొట్టుకొంటుంది. అతడంటే ఇష్టమైంది. అతని మీద తను కూర్చున్న విధం తలుచుకుంటే ఇప్పటికీ గుండె జల్లు మంటుంది!

మల్లేశ్వరి ముఖం ఎర్రబడటం చూసి, ఆ రోజు సినిమాలో జరిగింది తలుస్తుందని గ్రహించాడు.

మల్లేశ్వరి చెయ్యి అందుకున్నాడు "స్వప్నా!" తియ్యగా పిలిచాడు. మల్లేశ్వరికి ధైర్యం చిక్కింది. నేరుగా అతనివైపు చూసింది.

"బాబాయ్ మీకు అబద్ధం చెప్పాడు. అమ్మ నాన్న అమెరికాలో లేరు. ఇక్కడే ఇండియాలో ఉన్నారు వాళ్ళకి ముగ్గురు కూతుళ్ళు. పెద్దక్క భానుమతి బావ, ఢిల్లీలో ఉన్నారు. చిన్నక్క రత్నమాల చని పోయింది. కాదు ... చంపేశారు."

అతను ఆశ్చర్య పోలేదు. వినరాని విషయం విన్నట్లు ఉలిక్కిపడనూ లేదు.

"నీవు చెప్పదలచుకుంది ఇదేనా?!"

అవునన్నట్లు తల వూపింది.

"ఇక పోదామా?"

"మరి .. రత్నమాల ఎలా చచ్చిపోయిందో ఎట్టి పరిస్థితులలో చంపబడిందో మీకు తెలుసుకోవాలని లేదా?"

"అవి జ్ఞాపకం చేసుకోవటం నీకు బాధగా ఉంటుంది. నీవు బాధపడటం నా కిష్టం ఉండదు."

"అయితే మీరు నన్ను నిజంగా పెళ్ళి చేసు కుంటారా?"

"నీవు ఏం చెప్పినా, మీ కుటుంబ విషయాలు ఎలాటివైనా నిన్ను పెళ్ళిచేసుకుంటాను. ఐలవ్ యూ అంటూ చేతిని ముద్దుపెట్టుకున్నాడు.

ఆ క్షణంలో మల్లేశ్వరిలోని దుఃఖం, భయం, అనుమానాలు తుడిచివేసినట్లు పోయాయి. హృదయం తేలిక పడింది. ముఖం జీవకళతో కళకళ లాడింది.

మల్లేశ్వరిలో కలిగిన మార్పు గుర్తించాడు.

"రత్నమాల నీ అంత అందంగా ఉండేదా!"

"నా అంతకాదు. నాకంటే బాగుండేది. నాకంటే ఎత్తు, పొడుగాటి జడ."

"......" అశోక్ రత్నమాల గురించి వినాలని కుతూహలపడుతున్నాడని గ్రహించి చెప్పసాగింది.

"రత్నమాలకి హిందీ సినిమాలంటే ఇష్టం. అమితాబ్ అంటే మరీ ఇష్టం. ఆరోజే వచ్చిన సినిమాకి సునీత, మమత వచ్చి రత్నమాలను పిల్చుకుపోయారు.

మొదట ఆట వదిలే టైం అయినా మాల రాలేదు అలా ఎదురు చూస్తుండగానే పదకొండు గంటలైంది. అమ్మ ఎదురు చూస్తూ ఇంట్లోకీ, బయటకు తిరుగుతోంది. ఆ హాలు దగ్గర్లోనే మమత ఇల్లు ఉండాలి. అక్కడే ఉండి రెండో ఆటకు వెళ్ళి ఉంటారు అని చెప్పాను.

నిద్రపోతున్న నాన్నను లేపి సినిమా హాలుకు పంపింది, ఉండలేక.

సినిమా వదిలేటప్పటికి ఒంటిగంట అయింది. గేటు దగ్గరే నిలుచున్న నాన్నకి రత్న కాని, ఆమె ఫ్రెండ్స్ కానీ కనపడలేదు.

ఈ సినిమాకి రాలేదు. మరో సినిమాకి వెళ్ళి ఉంటారు. ఈపాటికి తిరిగి ఇంటికి వచ్చి ఉంటుందన్న నమ్మకంతో వచ్చాడు.

గేటు దగ్గరే నిలుచున్న అమ్మని అడిగాడు వచ్చిందా అని.

"వస్తే మీతోనేకదా రావాలి. అక్కడ లేదా, ఎక్కడికి వెళ్ళి ఉంటుంది! చెప్పక ఎక్కడికి వెళ్ళదే. సునీత, మమతల ఇండ్లకు వెళ్ళి చూసి రండి" అని చెప్పింది. భయాన్ని, గాభరాని కనబడనీయలేదు. వాళ్ళ ఇల్లు ఎప్పుడు చూడ లేదు మమత ఇల్లు ఎక్కడ ఉందో తెలుసు, లోపలికి ఎప్పుడు పోలేదు ఆ రాత్రిలో మమత ఇల్లు వెతుకుతూ వెళ్ళారు. మమత ఇంట్లో అందరూ గాఢ నిద్రలో ఉన్నారు. ఇంట్లో ఎవరికి బెడ్‌లైటు కూడ వేసిలేదు. తటపటాయిస్తూ ఆ ఇంట్లో వాళ్ళని లేపి మమతని అడిగారు. వారికి అప్పుడే మమత గుర్తుకు వచ్చినట్లుంది. నిద్ర మత్తులో ఉన్న మమత తల్లి కాబోలు—"ఎక్కడ చచ్చిందో ఏమో ! మధ్యాహ్నంగ వెళ్ళింది. మమత వచ్చి పిల్చుకు పోయింది" అని ఆవులించింది.

సునీత ఇల్లు ఎక్కడ ఉందో వాళ్ళకి తెలియదు. మమత తమ్ముడు ఎనిమిదేళ్ళ వాడిని కొట్టి లేపారు వాడికి తెలుసునని. ఆ చిన్నవాడిని తీసుకుని సునీత ఇంటికి వెళ్ళారు.

తలుపు తట్టగా తట్టగా ఎప్పటికో ఒక వృద్ధుడు వచ్చి తలుపు తీసి, తల బయటికి పెట్టాడు. ఆవేళప్పుడు లేపిన వాళ్ళవైపు చిరాగ్గా చూశాడు.

"సునీత ఇల్లు ఇదేనా !" అని అడిగింది.

"ఇది నా ఇల్లు—ఏం కావాలి."

"సుమతి ఉందా అండీ! సినిమా నుంచి వచ్చారా!" అలాగా రత్నమాల ఆ ఇంట్లో ఉందని లోపలికి చూస్తూ అడిగింది.

"ఏమేవ్! సుమతి ఉందా! వీళ్ళెవ్వరో వచ్చారు" అంటూ భార్యను పిలిచి అడిగాడు.

సుమతికి అమ్మా, నాన్న లేరు. తాతయ్య ఇంట్లో ఉంటుంది. ఆ వృద్ధురాలులేచి వచ్చింది—"ఎవ్వరూ" అంటూ.

"సుమతా? దాని స్నేహితురాలి ఇంటికి వెళుతున్నానని చెప్పింది"

"ఇక్కడా లేరు. ఏమైనట్లు?" కదలకుండ అక్కడే నిలుచున్న నాన్న చేయి పట్టుకుంది. వృద్ధుడు తలూపేశాడు.

"ఆ సుమతి ఎవ్వడితోనైనా లేచిపోయిందా! ఏం ఖర్మో" వృద్ధురాలు అనటం స్పష్టంగా విన్నారు.

అప్పుడే రెండుగంటల రైలు బండి పెద్దగా కూతవేస్తూ మెల్లి మెల్లిగా పోవటం విన్నారు.

ఇంటికి వెళ్ళేదాక ఆ రైలు కూత చెవిలో గింగురుమంటూనే ఉంది.

అమ్మ ఇంకా ఆ చీకటిలో ఎదురు చూస్తూ గేటు దగ్గరే నిలబడి ఉంది.

రాత్రి చూస్తుండగానే తెల్లారిపోయింది.

పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి రిపోర్టు ఇచ్చి వచ్చారు నాన్న.

పొద్దు పొడుస్తూనే రైలు క్రింద ఎవరో అమ్మాయిలు పడ్డారు అన్న వార్త వూరంతా పాకిపోయింది. రత్నమాలకు రైలు క్రింద పడి చచ్చిపోయే అవసరం లేదు. రాదు. కనుక ఆ చచ్చిన అమ్మాయిల్లో రత్న ఉండదు అని గట్టిగా నమ్మి, ఉండకూడదు అని భగవంతుని స్మరించాం.

మా ఆలాపనలు భగవంతుని చేరకముందే రత్నమాల కొరకు వెతుకుతున్నప్పుడే—"ఎప్పుడో చచ్చిపోయింది కాదు— దారుణంగా హత్య చేయబడింది."

మల్లేశ్వరికి దుఃఖం ఆగలేదు. మాసిపోయిన గాయం కొత్తగా చెలరేగింది.


మల్లేశ్వరి ఏడుపు ఆగేటంత వరకు సహనంగ సానుభూతి చూపిస్తూ కూర్చున్నాడు అశోక్.

చచ్చి పడి ఉంది రత్నమాల, సుమతీలు. మరి మమత ఏమైంది అని అడిగాడు.

ఆ రోజువారికి టిక్కెట్లు దొరకలేదు కాబోలు— ఆ వేళ సినిమా హాలు దాటి మెయిన్ రోడ్డు మీదగా పొలాల వైపు షికారుకు పోవటం ఎవరో చూశారట. ఆ తరవాత ఏమైందీ ఎవ్వరికీ తెలియదు. కాని, వారిని అనుసరిస్తూ వెళ్ళిన అబ్బాయిలు ఆ పక్క తోటలోకి తొక్కుపోయి ఉంటారు.

అంతా తొమ్మిది పది గంటలలోపే జరిగిపోయింది.

పోలీసు వాళ్ళు అది ఆత్మహత్య కింద తేల్చారు. క్లియర్‌గా అది దుర్మార్గుల హత్యాకాండ హింసాకాండ అని స్పష్టంగాతెలుస్తున్నా ఆత్మహత్య అంటున్నారని తెలిసి తక్కువ వాళ్ళుకూడ నోటిమీద వేలు ఉంచుకున్నారు.




ఆత్మహత్య చేసుకునే ఏ స్త్రీ అయినా శరీరం మీద గుడ్డలు తొలగకుండ జాగ్రత్త పడుతుంది. ఆ శరీరాలు నగ్నంగా ఉన్నాయి. దరిదాపులో వారి దుస్తులు లేవు. దుష్టుల హింసాకాండకు గుర్తుగా వారి శరీరంపై గాయాలు, చను మొనలు కొరికి వేయబడ్డాయి.

పోస్టుమార్టంలో రత్నమాల కన్య అని తేలింది. రేప్ చేయలేదు అని చెప్పారు. ఆ దుర్మార్గుల చెయ్యి పైన బడక ముందే రత్నమాల భయంతో, అవమానంతో ప్రాణాలను వదిలేసి ఉంటుంది.

అది రౌడీలు తాగుబోతులు, దొంగలు చేసిన పని కాదు. వాళ్ళయితే దొరికి పోయేవాళ్ళు. ఇది గొప్పింటి అబ్బాయిల పని అని వూరంతా చెప్పుకున్నారు. అందుకే కేసు పైకి రానీయలేదని. ఎవ్వరూ పట్టించు కోలేదని బాహాటంగా చెప్పుకున్నారు.

ప్రజలను రక్షించ వలసిన పోలీసులు పోస్టు మార్టమ్ చేసిన డాక్టర్లు. అన్యాయాలను బయట పెట్టి నిజానిజాలు పైకి లాగి ప్రభుత్వం కళ్ళు తెరిపించవలసిన విలేఖరులు—ఇందరు. వీరందరూ ఏమైనారు? ఏం చేశారు?

అమాయకులైన బాలికలను అమానుషంగా చంపి రైలు కింద పడేసిన హంతకుల జాడ తెలుసుకో లేకపోయారా? మమత ఏమైంది, ఎక్కడ ఉందో కనుక్కున్నారా! కనుక్కున్నా హంతకు లెవ్వరో రాబట్ట లేకపోయారా? తెలుసుకున్నారు. కాని. న్యాయం, నిజాయితీ, రక్షణ అమ్ముడు పోయింది. సిరికిగా తల వంచుకుంది. ధర్మాన్ని పాతి పెట్టింది. హంతకు లను సంప్రదాయాలను వదిలేసింది. తోడేళ్ళ వంటి వారు మనుష్యులక్షి కలిసిపోయి తిరుగుతుంటే, చూస్తూ. . .

ఆ బిడ్డలను అన్యాయంగాపోగొట్టుకున్న తండ్రుల ఆర్తనాదాలను అణచి వేశారు. పైగా చచ్చిపోయిన అమాయకులకు అపవిత్రత అంట గట్టారు. బురద వేశారు. మసి పూశారు. ఆత్మీయులు తల వంచుకునేలాగ, కుళ్ళి పోయే లాగ చేశారు. కేసు తప్పు తోవ పట్టించారు.

దాని ఫలితం భానుమతిని ఇంటికి రానీయ లేదు. వాళ్ళు కావాలా, నేను కావాలా అన్నాడు బావ.

పెద్దక్క ఉన్నా లేనట్లే. చిన్నక్కని చంపేశారు. మిగిలిన నాకు పెళ్ళి కావటం గగనమై పోయింది. ఎక్కడికి పోయినా, ఎవరొచ్చినా రత్నమాల సంగతి ఎత్తుతారు. నన్నో కళంకిని లాగ చూస్తూ, వారి సంబంధం మాకు వద్దు అన్ని పారిపోయారు.


బంగారు లాంటి రత్నమాలను పోగొట్టుకుని బాధ పడుతున్న మా బతుకులు నరకం చేశారు. ఏ పాపమూ చేయని మాకు శిక్ష వేశారు.

అందుకే—బాబాయ్ ఎలాగైనా నాకు పెళ్ళి చేయాలని మీకు అలా చెప్పారు."

అశోక్ చెమర్చిన తన కళ్ళను తుడుచుకొని మల్లి కంటి నీరు తుడిచి, చెయ్యి పట్టుకుని లేపాడు.

మల్లేశ్వరి ఆ మంచి వాడి చెయ్యి నమ్మకంగా పట్టుకుని నడిచింది. *

మీకు బేబి/బాబు కావాలా



ఆపరేషన్, ఇతర వైద్య చికిత్సలచే నిరాశ చెందిన సోదరీమణులు అనేకులు మా వలన సంతానవతులయి ఇచ్చిన యోగ్యతాపత్రములు కలవు. స్త్రీ పురుష వంధ్యాదోష నివారణ నిపుణులు. ఉచిత వివరములకు

శ్రీ నాగార్జున మూలిక కుటీరం
రైల్వే స్టేషన్ వద్ద, రామాలయం వీధి.
తెనాలి - 2